క్లుప్తంగా

వైభవంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న స్వాములు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామి తుమ్మూరి వెంకట రమణ ఆధ్వర్యంలో అరటి డొప్పలతో స్వామి వారి మండపం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్వాములు మీసాల అనిల్ కుమార్, తుమ్మూరి చంద్రశేఖర్, పండూరి రామ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

22న గిరి గోవర్ధన పూజ

రంగంపేట: జి.దొంతమూరు గ్రామంలోని ఇస్కాన్‌లో ఈ నెల 22న గిరి గోవర్ధన పూజా మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు గోపూజ అనంతరం సత్య గోపీనాథ్ ప్రభూజీచే గోవర్ధన లీలా ప్రవచనం, గిరి గోవర్ధన పూజ, హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్తిక మాసంలోని మొదటి రోజు జరిగే ఆ అన్నసమారాధనలో భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

చెత్త సేకరణ బాధ్యతగా చేపట్టాలి



పెద్దాడలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో చెత్త సేకరణను బాధ్యతగా చేపట్టాలని క్లాప్‌మిత్రాలకు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి సూచించారు. ఆయన గురువారం పెద్దాడ గ్రామంలో జరుగుతున్న చెత్త సేకరణ, పారిశుధ్య పనులను పరిశీలించారు. క్లాప్ మిత్రాలు చెత్త సేకరణ ఎలా చేస్తున్నారో ప్రజలను అడిగి వివరాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం సచివాలయంలో ఇసుక రీచ్‌పై గురువారం ఆర్డీవో కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ సభ నిర్వహించారు. కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు పీసీబీ, రెవెన్యూ, మైన్స్ శాఖల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజల సూచనలను పరిగణనలోకి తీసుకుని తుది నివేదిక రూపొందిస్తామన్నారు. సీతానగరంలో ప్రాజెక్టు విస్తీర్ణం 10.343 హెక్టార్లు కాగా, ఇది గోదావరి ఎడమ ఒడ్డున సర్వే నెంబరు 210/2, 210/3, 212, 213/1, 213, 214/1, 214/2, 212/1లో విస్తరించి ఉందన్నారు. ప్రతిపాదిత ప్రాజెక్టు ద్వారా సుమారు 2.45 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు జరిపేందుకు ప్రతిపాదించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ శ్రీనివాసరావు, ఏడీఈ మైన్స్ డి.ఫణి భూషన్ రెడ్డి, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

పెదపూడి: ఇటీవల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్యశాఖకు సంబంధించి, వివిధ పరికరాలు, మందులపై జీఎస్టీ తగ్గించిందని దానిపై రోగులు.ప్రజలకు అవసరమని ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణ రెడ్డి అన్నారు. పెదపూడి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవల సూపరింటెండెంట్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన దంతవైద్య నిపుణడు ఎం.ప్రశాంత్ అధ్యక్షతన జీఎస్టీ తగ్గింపుపై రోగులు, ప్రజలకు అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు.

సీతానగరం: జీఎస్టీ తగ్గుదలతో అత్యవసర మందుల రేట్లు తగ్గుతాయి ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఎం.శైలజా రాణి ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు.

రాజానగరం: జీఎస్టీ మార్పులపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సిబ్బంది రాజానగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత పీహెచ్‌సీలో సమావేశం జరిగింది.

జీఎస్టీలో ఇటీవల వచ్చిన మార్పులపై ప్రజలను చైతన్యపరుస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వర రావు అన్నారు. మండలంలోని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఇంటర్ ఫీజుకు గడువాయె..

- చెల్లించడానికి నేడు ఆఖరి రోజు
- గడువు దాటితే రూ.వెయ్యి అపరాధ రుసుం
- సకాలంలో ఫీజులు చెల్లించాలంటున్న అధికారులు



రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు

రంగంపేట: వచ్చే ఏడాది నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు సంబంధించి ఫీజుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ క్రమంలో ఎటువంటి అపరాధ రుసుము లేకుండా శుక్రవారం (అక్టోబరు 10) తుది గడువుగా సంబంధిత బోర్డు స్పష్టం చేసింది. గడువు దాటితే అంటే ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు రూ.వెయ్యి అపరాధ రుసుముతో చెల్లించేలా అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో సదరు విద్యార్థులు అదనపు మొత్తం చెల్లించే అవకాశం ఇవ్వకుండా తుది గడువు లోగా చెల్లించడం ఉత్తమమని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి.

ఫీజుల చెల్లింపు ఇలా...

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు థియరీ పరీక్షల కోసం రూ.600, జనరల్ కోర్సులు చదువుతున్న ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు రూ.275 చెల్లించాలి. ఒకేషనల్ కోర్సులు చదువుతూ బ్రిడ్జి కోర్సు చేసే విద్యార్థులు బ్రిడ్జి సబ్జెక్టులకు పరీక్ష ఫీజుగా రూ.165 కట్టాలి. ద్వితీయ సంవత్సరం చదువుతూ మొదటి సంవత్సరం పరీక్షలు తప్పిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ ఏడాదిలకు థియరీ ఫీజుతో కలిపి రూ.1200 చెల్లించాలి. ఒకేషనల్ కోర్సులు చదువుతూ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్‌కు హాజరు కావాల్సిన వారు రెండేళ్లకు కలిపి రూ.550 కట్టాలి. బ్రిడ్జి కోర్సులు చదువుతున్న విద్యార్థులు రెండేళ్లకు రూ.330 చెల్లించాలి. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించి, మార్కులు పెంచుకునేందుకు పరీక్షలు రాయాలనుకునే ఆర్ట్స్ విద్యార్థులు రూ.1350, సైన్స్ విద్యార్థులు రూ.1600 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

సకాలంలో చెల్లిస్తే మేలు



ఫీజుల స్వీకరణ ప్రారంభమైంది. విద్యార్థులు ఈ విషయం గమనించి సకాలంలో నిర్దేశిత ఫీజులు చెల్లించాలి. లేకుంటే అదనపు రుసుం కట్టాల్సి ఉంటుంది. దీనిపై ఇప్పటికే విద్యార్థులకు అవగాహన కల్పించాం.

– బి.హేమ, ప్రిన్సిపాల్, రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

నియోజకవర్గంలో కళాశాలలు

అనపర్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తొమ్మిది జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో అనపర్తి మండలంలో రెండు ప్రైవేటు, పెదపూడి మండలంలో ఒక హైస్కూల్ ప్లస్, మూడు ప్రైవేటు, బిక్కవోలు మండలంలో ఒక హైస్కూల్ ప్లస్, రంగంపేట మండలంలో ఒక హైస్కూల్ ప్లస్, ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నాయి. వీటిలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలిపి సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

దేశీయ ఆరోగ్య పరిజ్ఞానంపై వర్క్‌షాప్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

రాజానగరం: సంప్రదాయ వైద్య పద్ధతులను ఆధునిక ప్రజా ఆరోగ్య వ్యవస్థలతో అనుసంధానించడం ద్వారా సమగ్ర ఆరోగ్య ఫలితాలు సాధ్యమవుతాయని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ అన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని గైట్ డిగ్రీ కళాశాలలో హెచ్‌బీఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం 'దేశీయ ఆరోగ్య పరిజ్ఞానం మహిళా వైద్యులు – సంప్రదాయ పద్ధతులు, ప్రజారోగ్య ఏకీకరణపై అధ్యయనం' అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి, కోఆర్డినేటర్లు డాక్టర్ ఎం.సావిత్రి, ఎ.మాధవి కామేశ్వరి, హెచ్‌ఓడీ సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రామ్మోహనరావు సేవలు చిరస్మరణీయం



సీతానగరంలో జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చినకొండేపూడిలో రామ్మోహనరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

- స్మరించుకున్న నాయకులు
- వాడవాడలా దివంగత మాజీ మంత్రికి నివాళి

సీతానగరం: దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ వలంటీర్ల విభాగం రాష్ట్ర సహాయక కార్యదర్శి పెదపాటి రమేష్ బాబు (డాక్టర్‌బాబు), రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు అన్నారు. రామ్మోహనరావు వర్ధంతి సందర్భంగా సీతానగరం మదర్ థెరిస్సా సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, ఈత వీరబాబు, అధికారి శ్రీను, పెదపాటి ప్రసాద్, మానేపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- చినకొండేపూడిలో సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం నియోజకవర్గ చైర్మన్ పోలినాటి ఈశ్వరుడు, ముదునూరి రామకృష్ణంరాజు తదితరులు దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కంపూడి రామ్మోహన్‌రావు సేవలను దృష్టిలో ఉంచుకుని, ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. అనంతరం పలువురికి పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో యర్రంశెట్టి బాబులు, చిడిపి బంగారయ్య, కోనే ఇంద్ర, కోసూరి నాగరాజు, బొచ్చు మురార్జీ, లక్కిశెట్టి శ్రీను, ఆకుల రామారావు పాల్గొన్నారు.
- నాగంపల్లిలో పార్టీ నాయకుడు మన్నెల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేశారు.
- ఇనుగంటివారిపేట సర్పంచ్ సత్యం రాంపండు, వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్‌బాబు ఆధ్వర్యంలో జక్కంపూడి రామ్మోహనరావు వర్ధంతి జరిగింది. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలు జరిపారు.

హ్యాండ్ బాల్ పోటీలకు శహపురం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, సర్పంచ్, పెద్దలు

పెదపూడి: శహపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నీలపల్లి శ్రీహరిరాజు, హెచ్‌ఎం జె.ఆశాలత తెలిపారు. ఈ మేరకు గురువారం విలేకర్లతో మాట్లాడుతూ కాకినాడలోని డీఎస్సీ క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన హ్యాండ్ బాల్ క్రీడా ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించారన్నారు. అండర్ –14 బాలుర విభాగంలో ఎం.శామ్యూల్ మోరిస్, ఎం.గణేష్, బాలికల విభాగంలో జి.ఆనందిని, వి.ధరణి, వై.దీక్షిత, అండర్ – 17 బాలుర విభాగంలో బి.విజయ సాయిసుధీర్, బి.సంతోష్ శివ, ఎం.సంతోష్ కుమార్, పి.అనిల్ కుమార్, బాలికల విభాగంలో కె.రత్నం, ఎం.అమృతవర్ష, కె.రేవతి, కె.మణి, అండర్ –19 బాలుర విభాగంలో ఎస్‌వీవీఎస్ఎస్ సిద్ధార్థ, బాలికల విభాగంలో వి.తేజశ్రీదుర్గ, ఆర్.షర్మిల దీప్తి, బి.శ్రీలోవ వీర నిఖిలా దేవి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. వారిని జె.ఆశాలత, గ్రామ సర్పంచ్ వనుం శాంతకుమారి, వనుం వెంకటరమణ, విద్యాకమిటీ చైర్మన్ వై.లక్ష్మీదుర్గ, మాజీ మాజీ ఎంపీటీసీ సభ్యుడు టి.రాంబాబు, పీడబ్ల్యూఎసీ చైర్మన్ మెర్ల వీర వెంకట ప్రభాకర్ చౌదరి (చినబాబు) అభినందించారు.

ఎండాకు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి



చినకొండేపూడిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో గౌరీదేవి

సీతానగరం: వరి పంటను ఎండాకు తెగులు ఆశించిందని, దాని నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖాధికారి గౌరీ దేవి అన్నారు. ఆమె గురువారం చినకొండేపూడిలో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీపీటీ 5204, పీఎల్ఎ 1100 రకాలకు ఎండాకు తెగులు ఆశించడంతో ఆకులు మాడిపోతున్నాయన్నారు. ఈ తెగులు బాక్టీరియా వల్ల సోకుతుందని, సాగునీటి ద్వారా ఒక పొలం నుంచి మరో పొలానికి వ్యాప్తి చెందుతుందన్నారు. పొలాల్లో పాత నీటిని తీసి, ఆరగట్టి తిరిగి నీరు పెట్టాలన్నారు. నత్రజని ఎరువుల వాడకం తాత్కాలికంగా ఆపి వేయాలని, మ్యూరియేట్ ఆఫ్ పోటాష్ ఎకరాకు 20 కిలోలు వేయాలన్నారు. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే ప్లాంటోమైసిన్ 1.0 గ్రాములు, కాపర్ హైడ్రాకసయిడ్ 2.0 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారమివ్వాలి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాయవరం గ్రామ పరిధిలోని గణపతి ఫైర్ వర్క్స్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఎల్‌జీ పాలిమర్స్ తరహాలో ప్రభుత్వం రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన గురువారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఘటనలో సంబధిత అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోందన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయకపోవడం, భద్రతా చర్యలు అమలు చేయకపోవడమే ఈ దుర్ఘటనకు ప్రధాన కారణమన్నారు. ఇప్పటి వరకూ ఎనిమిది మంది మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. పలువురు తీవ్ర గాయాలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నిరుపేదలైన వారికి చికిత్సకు అవసరమైన ఖర్చులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పందలపాక కన్వీనర్ సత్తి హరి ప్రసాద రెడ్డి, సీనియర్ నేత రొంగల అప్పాజీ తదితరులు ఉన్నారు.

తాగునీటికి అవస్థలు



నీటి కోసం ఉప్పయ్యపాలేనికి మోటారు సైకిల్‌పై వెళుతున్న కోటి గ్రామస్తుడు

కోరుకొండ: మండలంలోని కోటి, కోటికేశవరం, శ్రీరంగపట్నం గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. వీరందరూ సత్యసాయి రక్షిత మంచినీటి పథకం నుంచి వచ్చే నీటిని పట్టుకునేవారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఆ పథకం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నీటి ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నీటి కోసం రంపచోడవరం నియోజకవర్గంలోని ఉప్పయ్యపాలెం వెళుతున్నారు. సుమారు 10 నుంచి 15 కిలోమీటర్ల దూరం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. మండలంలోని 22 గ్రామాల్లో సుమారు 84 వేల మంది జనాభా ఉన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం



పేకేటి సూర్యప్రకాశరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు: విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమని ఇలపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పప్పు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు గురువారం జి.మామిడాడ శ్రీసూర్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు రూ.15 వేల విలువైన ఎస్ఎంఎంఎస్ మెటిరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చిన్నారెడ్డి మాట్లాడుతూ కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడలో 20 ఏళ్లుగా శ్రీ సూర్య లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. అనంతరం ఆ క్లబ్ మొదటి ఉపాధ్యక్షుడు, లయన్ పేకేటి సూర్యప్రకాశరావును ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు పప్పు మాయ్య, మండ రాజారెడ్డి, రాయుడు వీర్రాఘవులు, చత్రపతి శివాజీ, వీఆర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో అట్లతద్దె



పందలపాకలో గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు



రంగంపేటలో పూజలు చేస్తున్న మహిళలు

బిక్కవోలు: అట్లతద్దె పండగను నియోజకవర్గంలో మహిళలు గురువారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. వేకువ జామునే ఉపవాస దీక్ష స్వీకరించి, పసుపుతో గౌరీదేవిని తయారు చేసి, ఆనవాయితీ ప్రకారం అట్లువేసి నివేదించారు. ముత్తయిదువులకు వాయినాలు అందించారు. సాయంత్రం వరకు ఉపవాసం ఉండి చంద్ర దర్శనం అయ్యాక దీక్ష విరమించారు. బిక్కవోలు, పందలపాక, కొంకుదురు, కొమరిపాలెం, ఊలపల్లి, రంగాపురం గ్రామాల్లో మహిళలు అట్లతద్దె పూజలు చేశారు.

రంగంపేట: మండలంలో అట్లతద్దె వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు స్థానిక మంచి నీటి చెరువులు, కాలువలు వద్ద పూజలు నిర్వహించారు. గౌరమ్మ ఆశీసుల కోసం పాటలు పాడి మంగళహారతులు ఇచ్చారు. రంగంపేటలోని నల్లచెరువు వద్ద మహిళలు సందడి నెలకొంది.

న్యాయమూర్తుల రక్షణకు చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జార్జి ఆంటోనీ

సీటీఆర్ఐ: న్యాయమూర్తుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బి.జార్జి ఆంటోని అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని ఖండించారు. న్యాయ వ్యవస్థ వల్లే దేశంలో ఇంకా ప్రజాస్వామ్యం బతికి ఉందన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అంటే పవిత్ర న్యాయవ్యవస్థపై దాడి చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గవాయ్ కుటుంబీకులు ఎంతో ఉన్నత ఆదర్శాలు, అభ్యుదయ భావాలు కలిగిన వారన్నారు. ఆయన తండ్రి ఎంపీగా, గవర్నర్‌గా పనిచేశారని గుర్తుచేశారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా సోమేశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఎ.ప్రసాద కుమార్, ఎహెచ్.లూథర్ ఫ్రెడ్రిక్, ఉపాధ్యక్షుడు కుసుమ సాయిబాబా పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

సీతానగరం: పురుషోత్తపట్నంలో బండి సుజాత ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి, వస్తువులు, నగదు తీసుకువెళ్లిన మునికూడలికి చెందిన రాయి సునీత, కుమారుడు వంశీలపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ గురువారం తెలిపారు. ఈ ఘటనపై సుజాత ఫిర్యాదు చేసిందన్నారు.

పద్యాలతో తెలుగుభాషపై మక్కువ

కంబాలచెరువు: తెలుగు భాషపై మక్కువ పెంచేందుకు పద్యాలు ఎంతో తోడ్పడతాయని కళాగౌతమి వ్యవస్థాపకుడు డాక్టర్ బులుసు వెంకట సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక మోరంపూడి సిటీ స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో తెలుగు పద్యాల పోటీలు నిర్వహించారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



రైల్వేస్టేషన్‌లోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్‌లో తినుబండారాలను అధిక ధరకు విక్రయిస్తున్న దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ సాయిరామ్ ఆదేశాల మేరకు గురువారం ఆయా దుకాణాలపై దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా రూ.110 విలువైన డైరీ మిల్క్ చాక్లెట్‌ను రూ.115కు అమ్ముతుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో పాల్గొన్న జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ వస్తువులను ఎమ్మార్పీకి మించి కొనుగోలు చేయకూడదని వినియోగదారులకు సూచించారు. ఏవైనా ఫిర్యాదులుంటే 1915 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలన్నారు.

అనాథలా మారిన నగరపాలక సంస్థ



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: పాలక వర్గం లేకపోవడంతో తల్లీతండ్రీ లేని అనాథలా నగరపాలక సంస్థ మారిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 జరిగే గోదావరి పుష్కరాల నేపథ్యంలో రూ.1500 కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. సరైన ప్రణాళికలు లేకపోవడం, అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవడంతో పుష్కరాల నిర్వహణపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రివర్ ఫ్రంట్ పేరుతో ఏదో చేద్దామని ఉత్సాహం చూపించారని, ఆ తర్వాత మంత్రివర్గం కమిటీ అనే సరికి నోరు విప్పడం లేదన్నారు. తెలుగు విశ్వవిద్యాలయానికి కనీసం వీసీ, రిజిస్ట్రార్‌ను నియమించి అడ్మిషన్లు కూడా ప్రారంభించలేదని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఎంపీగా పురందేశ్వరిని ఎందుకు గెలిపించారో ప్రజలకే అర్థం కాని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు.